# ఆడుతు పాడుతు నేర్చుకుంటుంటే!



వేదగణిత సదస్సులో పాల్గొన్న పిన్నలు మరియు పెద్దలు.

మనకి ఇష్టమైన పని చేస్తున్నప్పుడు అలసటగాని, గడచిపోతున్న కాలముమీద దృష్టిగాని ఉండదు. అందుకే మన పెద్దలు 'ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపూ సొలుపేమున్నది' అన్నారు. ఉదాహరణకు మనకు నచ్చిన చలనచిత్రము (సినిమా) చూస్తున్నప్పుడు, నిద్ర వస్తున్నాకూడా, దానిని ఆపుకుని చలనచిత్రము చూడడానికే ప్రాధాన్యమునిస్తాము. చిన్నపిల్లలు వారికి మానసికోల్లాసము కలిగించే సన్నివేశములలో ఆకలి, నిద్ర వంటి విషయములను మరిచిపోవడం సామాన్యమే కదా! నేటి రోజులలో వీడియో గేమ్స్ చాలామంది పిల్లలకు జీవితమైపోయింది అంటే అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు.

మే 8వ తారీఖున (శుక్రవారం) సంఘమిత్ర కాలిఫోర్నియాలోని సన్నీవేల్‌లో వేదగణితముపై సదస్సును నిర్వహించింది. ప్రేక్షకులు మంత్రముగ్ధులై ఆ సూత్రములను విన్నారు. కొంతమంది ప్రేక్షకులు ఆధునిక పద్ధతులద్వారా ఈ సూత్రములను నేర్చుకోవాలనే ఆసక్తిని కనబరిచారు.

ఆడుతూ పాడుతూ సమస్యలను సాధించడంలో పిల్లలకు ఉత్సాహం కలుగుతుంది. దీనివలన వారు ఈ విషయములను నేర్చుకోవడమే కాకుండా, క్రొత్త విషయములను నేర్చుకోవాలనే తపన చూపిస్తారు. ముఖ్యముగా ఈ సదస్సు వారిలో ఆత్మవిశ్వాసమును పెంచడానికేగాని, ప్రతి సమస్యకి పరిష్కారము ఇవ్వడానికి కాదు. ఒకసారి పునాది శక్తివంతమైతే, దానిమీద అంతస్థులను నిర్మించడం సులభతరమైపోతుంది. ఎనభై మందికిపైగా హాజరైన ఈ సదస్సులో సంఘమిత్ర వేదగణితమునకు సంబంధించిన కొన్ని సూత్రములను, సమస్యలను పరిష్కరించడానికి పద్ధతులను తెలియజేసింది. తరువాత శాన్‌హోజె, సన్నీవేల్, కూపర్టినో మరియు శాంతాక్లారా సదస్సులలో మరికొన్ని పద్ధతులను తెలియజేసి, కార్యక్రమములను విజయవంతముగా నిర్వహించింది. ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యము పాల్గొన్న వారందరూ వారికి తెలిసిన విషయములను ప్రక్కవారితో పంచుకుంటూ, వారి విజ్ఞానమును మెఱుగుపరచుకోవడం.

పాఠకులకు విరోధినామ సంవత్సర శుభాకాంక్షలు **- సుశ్రీ.**